అర్హులైన మహిళలందరికీ పక్కా ఇళ్లు

- సంధిపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం
- లబ్ధిదారులకు 183 పట్టాల పంపిణీ

ఆలమూరు: ప్రతి మహిళకు సొంతిల్లు కల నిజం చేయాలన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆశయ సాధన మేరకు నియోజకవర్గంలో రికార్డు స్థాయిలో సుమారు 17,500 మందికి ఇళ్ల పట్టాలను అందజేసి కాలనీలు నిర్మిస్తున్నామని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. మండలంలోని సంధిపూడిలో శనివారం రెండో విడత గడప గడపకూ కార్యక్రమం జరిగింది. పీఏసీఎస్ అధ్యక్షుడు మోటుపల్లి వెంకన్న, గ్రామ కమిటీ అధ్యక్షుడు పోలాబత్తుల చిన్న, యూత్ పార్టీ నేత తోరాటి గోవిందు ఆధ్వర్యంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలు లేవనెత్తిన సమస్యలను సంబంధిత అధికారుల సహకారంతో అక్కడి కక్కడే పరిష్కరిస్తూ, సందేహాలను నివృత్తి చేస్తూ ముందుకు సాగారు. గ్రామాభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానని, మహిళల ఆర్థిక స్వావలంబనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలో సుమారు రూ.12.43 కోట్లతో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి పేద, మధ్య తరగతి ప్రజలకు అండగా నిలిచిన రాష్ట్ర ప్రభుత్వ రుణం ఎన్నటికీ తీర్చుకోలేమని గ్రామస్తులు వ్యాఖ్యానించారు.



సంధిపూడిలో అర్హులైన మహిళకు ఇళ్ల పట్టా అందజేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి



సంధిపూడిలో మహిళకు సంక్షేమ పథకాల్ని వివరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

మహిళలకు ఆడపడుచు కట్నంగా..,

రాష్ట్రంలోని ఇళ్లు లేని నిరుపేద మహిళందరికీ ఆడపడుచు కట్నంగా సీఎం జగన్ రూ.లక్షల విలువైన ఆస్తిని ఆడపడుచు కట్నంగా అందిస్తున్నారని ఎమ్మెల్యే జగ్గిరెడ్డి కొనియాడారు. పేద వర్గాల కోసం నిర్మించబోయే కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించి మహిళలను విలువైన ఇళ్లను నిర్మిస్తున్నామనేందుకు ఆలమూరులోని యర్ర కాలనీయే నిదర్శమన్నారు. అనంతరం పసుపు, కుంకుమ, గాజులు, నూతన వస్త్రాలతో ఇళ్ల పట్టాను ఆయన మహిళలకు అందజేశారు. ప్రజాభ్యుదయానికి, పేదరికం నిర్మూలనకు, మహిళాభ్యున్నతికి తీవ్రంగా శ్రమిస్తున్న సీఎం జగన్‌ను రాబోయే ఎన్నికల్లో మళ్లీ ఆశీర్వదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, బూత్ కమిటీ మేనేజర్ నామాల శ్రీనివాసు, గ్రామ సచివాలయ కన్వీనర్ సిద్ధిరెడ్డి శివ కాంతకుమారి, షేక్ షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

చిరకాల నిరీక్షణకు పరిష్కారం



ముక్తేశ్వరం-కాకినాడ రూట్ బస్సును ప్రారంభిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే చిట్టిబాబు

అయినవిల్లి: చాలా కాలంగా ఈ ప్రాంత సామాన్య ప్రజలు కాకినాడ వెళ్లేందుకు చాలా వ్యయప్రయాసలు పడాల్సి వచ్చేది. ఈ సమస్యను శనివారం రాష్ట్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పరిష్కరించారు. ముక్తేశ్వరం నుంచి తొత్తరమూడి, శానపల్లిలంక, కొండుకుదురు మీదుగా ముమ్మిడివరం, మురమళ్ల, ఎదుర్లంక, యానాం మీదుగా కాకినాడ వెళ్లే ముక్తేశ్వరం-కాకినాడ రూట్ బస్సును మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు జెండా ఊపి ప్రారంభించారు. కొంత దూరం బస్సులో ప్రయాణికులతో ప్రయాణించారు. ప్రభుత్వం తాము ఎంతో కాలంగా నిరీక్షిస్తున్న సమస్యకు పరిష్కారం కల్పించడంతో మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. తొలుత మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబుకు వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రయాణికులు, స్థానికులు పూలతో ఘన స్వాగతం పలికారు. దుశ్శాలువా వేసి సత్కరించారు. స్థానికంగా ఉన్న అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు మంత్రి, ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు కుడుపూడి విద్యాసాగర్, అయినవిల్లి విఘ్నేశ్వరుని దేవస్థానం చైర్మన్ గుత్తుల నాగబాబు, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు వార జయసావిత్రి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

సామాజిక తనిఖీలపై సమన్వయ సమావేశం

మలికిపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ మేడిచర్ల సత్యవాణి అధ్యక్షతన సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో ఎం.వీరాస్వామినాయుడు మాట్లాడుతూ, మండలంలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసిన జాతీయ ఉపాధి హామీ పథకం, పింఛన్లకు సంబంధించి సామాజిక తనిఖీలు నిర్వహించుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. మండల వ్యాప్తంగా రూ.8.57 కోట్ల విలువైన పనులు మంజూరు చేసి, చేపట్టామన్నారు. సామాజిక తనిఖీలు ఈ నెల 25వ తేదీ నుంచి వచ్చే నెల 6 వరకూ జరుగుతాయన్నారు. ఎస్‌ఆర్పీ సీహెచ్ సత్యనారాయణ, డీఆర్పీలు, ఏపీవో నాగప్రసాద్, ఫీల్డ్ అసిస్టెంట్స్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు దేవనర్తకి నాటకం ప్రదర్శన

కొత్తపేట: మండలంలోని వానపల్లి రామాచౌక్ సెంటర్ బాలకనకదుర్గ ఆలయం వద్ద శరన్నవరాత్ర ఉత్సవ పందిరిలో ఆదివారం రాత్రి 'దేవనర్తకి' నాటకం ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు రాష్ట్ర పార్టీ నాయకుడు, పళ్లాలమ్మ అమ్మవారి దేవస్థానం చైర్మన్ కామిశెట్టి అమ్మన్న తెలిపారు. రంగస్థల కళాకారులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఖ్యాతి ఘడించిన నటీనటులతో దేవనర్తకి నాటక ప్రదర్శనను చైర్మన్ ఏర్పాటు చేశారు. కళాభిమానులు, కళాపోషకులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి నాటక ప్రదర్శనను జయప్రదం చేసి, రంగస్థల కళా రంగానికి పూర్వ వైభవం తీసుకురాడంలో తోడ్పడాలని అమ్మన్న కోరారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



అడపా మురళీ వెంకటేశ్వర్లు (ఫైల్)

ఆలమూరు: 216ఏ జాతీయ రహదారిలోని చొప్పెల్ల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో అడపా మురళీ వెంకటేశ్వర్లు (48) మృతి చెందాడు. ఆలమూరు ఎస్సై ఎల్.శ్రీను నాయక్ కథనం ప్రకారం మూలస్థాన అగ్రహారానికి చెందిన మురళీ వెంకటేశ్వర్లు మండపేట మొబైల్‌షాపులో పని చేస్తుంటాడు. యథావిధిగా ఆయన శుక్రవారం రాత్రి పని ముగించుకుని తన బైక్‌పై తిరుగు పయనమయ్యాడు. రాజమహేంద్రవరం వైపు నుంచి వస్తున్న మురళీ వెంకటేశ్వర్లు స్థానిక లాకుల వద్దకు వచ్చేసరికి గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల కళ్లల్లో ఆనందమే సీఎం జగన్ లక్ష్యం

అంబాజీపేట: పేదల కళ్లల్లో ఆనందం చూడాలని నిరంతరం ఆలోచించే ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. అంబాజీపేట శివారు కముజువారిపేటలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఉందుర్తి నాగబాబు అధ్యక్షతన మాదిగల సమావేశం శనివారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ ప్రజల సంక్షేమాభివృద్ధి కోసం నిరంతరం పాటు పడే జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి ముఖ్యమంత్రిగా ఎన్నుకుంటే ఈ రాష్ట్రం నిరుపేదలు లేని రాష్ట్రంగా తయారవుతుందన్నారు. అందుకు దళితులంతా నిరంతరం వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేయాలన్నారు. సమావేశంలో విత్తనాల శేఖర్, కముజు స్వామి, కముజు చిరంజీవి, కముజు సాంబ, కముజు సురేంద్ర, మంద గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర యువమోర్చా అధికార ప్రతినిధిగా జేపీ



పాలూరి జయ ప్రకాష్ నారాయణ

కొత్తపేట: బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొత్తపేటకు చెందిన పాలూరి జయప్రకాష్ నారాయణ (జేపీ) నియమితులయ్యారు. ఆ మేరకు రాష్ట్ర యువ మోర్చా అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ నియామక పత్రాన్ని పంపినట్టు జేపీ శుక్రవారం విలేకరులకు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

పి.గన్నవరంలో మినీ జాబ్ మేళా

పి.గన్నవరం: జిల్లా ఉపాధి కార్యాలయం ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక లక్ష్మీ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో నేషనల్ సర్వీసెస్ ద్వారా మినీ జాబ్‌మేళా నిర్వహించారు. మూడు కంపెనీలు హాజరుకాగా 16 మంది అభ్యర్థులు ఎంపికయ్యారని జిల్లా ఉపాధి అధికారి ఇ.వసంతలక్ష్మి తెలిపారు. జాబ్ మేళాకు వైపీ రాజకుమార్, ఐటీఐ కళాశాల యాజమాన్యం తదితరులు ఏర్పాట్లు చేశారు.

యాగశాలకు రూ.3 లక్షల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి సన్నిధిలో నూతన యాగశాల నిర్మాణానికి అంబాజీపేట మాజీ సర్పంచ్ సుంకర సత్యవేణి, బాలాజీ దంపతులు శనివారం రూ.3 లక్షల విరాళం సమర్పించారు. ఈ మొత్తాన్ని కుటుంబ పెద్ద సుంకర సత్యనారాయణ, ఆదివేణి దంపతుల చేతుల మీదుగా ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణకు అందజేశారు. దాత కుటుంబాన్ని చైర్మన్ రామకృష్ణ, ఉద్యోగులు అభినందించారు. కార్యక్రమంలో మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు అడబాల తాతకాపు, ట్రస్టు బోర్డు సభ్యుడు చిట్టాల సత్తిబాబు పాల్గొన్నారు.

పీకే రావుకు ఎమ్మెల్సీల అభినందనలు



అంబాజీపేటలో పీకే రావును అభినందిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అంబాజీపేట: రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన పీకే రావును ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణరావు, బొమ్మి ఇజ్రాయిల్‌లు శనివారం ఆయన స్వగృహం వద్ద అభినందించారు. వారు మాట్లాడుతూ పీకే రావును సీఎం జగన్ గుర్తించి సరైన పదవి ఇచ్చారన్నారు. అనంతరం దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. ప్రతిగా ఎమ్మెల్సీలను పీకే రావు సన్మానించారు. అర్హులైన పేద బ్రాహ్మణులందరికీ తన కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తానని రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ పీకే రావు అన్నారు. అంబాజీపేటలో ఆయన స్వగృహంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ తాను బాధ్యతలు స్వీకరించాక సీఎం సహాయ సహకారాలతో అర్హులైన పేద బ్రాహ్మణులకు సాయమందిస్తానన్నారు. సమావేశంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, దొమ్మేటి సత్యమోహన్ పాల్గొన్నారు.

శ్రీ వేంకటేశం మనసా స్మరామి





వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ (అంతర చిత్రం) ప్రత్యేక అలంకరణలో స్వామివారు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. స్వామి వారిని సుమారు 35 వేల మంది దర్శించుకున్నారు. స్వామివారిని నెమలి పింఛాలు, సుగంధభరిత పుష్పాలతో అలంకరించారు. ప్రత్యేక దర్శనం, అన్నప్రసాద విరాళాలు, వివిధ సేవలు, లడ్డూ ప్రసాద విక్రయం, విరాళాల ద్వారా స్వామివారికి రూ.28,34,383 ఆదాయం సమకూరింది.

సురక్షతో ప్రజలందరికీ ఆరోగ్యం

అయినవిల్లి: జగనన్న ఆరోగ్య సురక్షతో రాష్ట్రంలో ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంకల్పమని రోడ్డు, రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శనివారం అయినవిల్లి మండలం విలసలో సర్పంచ్ కుసుమ లిల్లీమంగేష్కర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సందర్శించారు. వీరు మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్షకు రాష్ట్రంలో అన్నివర్గాల నుంచి విశేష ఆదరణ లభించిందన్నారు. వైద్యాధికారి బి.మంగాదేవి మాట్లాడుతూ విలసలో 511 మందికి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా సేవలందించినట్లు తెలిపారు. మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చేతుల మీదుగా ప్రభుత్వం అందించిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సత్యనారాయణ, ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అంబాజీపేట: రూపాయి ఖర్చు లేకుండా పేదలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల లక్ష్యమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. గంగలకుర్రు ఎంపీడీఓ కె.సత్యనారాయణ పర్యవేక్షణలో సర్పంచ్ కాండ్రేగుల శ్రీనివాసరావు అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు శనివారం జరిగింది. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నెల్లి పండు, దొమ్మేటి నాగన్న తదితరులు పాల్గొన్నారు.

రాజోలు: గ్రామ సచివాలయం-3 పరిధిలో స్థానిక బాలికోన్నత పాఠశాల ఆవరణలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. సర్పంచ్ రేవు జ్యోతి అధ్యక్షతన సమావేశం జరిగింది. జెడ్పీటీసీ మట్టా శైలజ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ఎంపీడీఓ ఎన్.బాలాజీ, మండల పార్టీ అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.



విలసలో ఆరోగ్య సురక్షలో స్టాల్స్ పరిశీలిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

ఆలమూరు: పేదల ఆరోగ్య రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా రాష్ట్రాన్ని సీఎం వైఎస్ జగన్ ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుతున్నారని పీఏసీఎస్ అధ్యక్షుడు మోటుపల్లి వెంకన్న, సర్పంచ్ తోట భవాని, ఎంపీటీసీ తోలేటి సంతోషి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు పోలాబత్తుల చిన్న అన్నారు. ఆలమూరు మండలంలోని సంధిపూడిలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో కె.జాన్ లింకన్, డీటీ ఎం.జానకీరాఘవ తదితరుల ఆధ్వర్యంలో వైద్యాధికారులు 324 మందికి మెరుగైన వైద్య సేవలు అందించి 105 రకాల మందులను ఉచితంగా అందజేశారు.

మామిడికుదురు: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు నిరంతరంగా వైద్య సేవలందిస్తారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. పాశర్లపూడి శ్రీసత్రంలో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపును ఎమ్మెల్యే సందర్శించారు. ఈ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, కుసుమ శ్రీధర్, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ అంకాడి వీరాంజనేయుడు తదితరులు పాల్గొన్నారు.



రాజోలులో మందులు అందిస్తున్న జెడ్పీటీసీ శైలజ

సఖినేటిపల్లి: మండలంలోని సఖినేటిపల్లిలంక శివారు చింతావారి పేటలో శనివారం ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని జెడ్పీటీసీ దొండపాటి అన్నపూర్ణ సందర్శించారు. సఖినేటిపల్లిలంక సర్పంచ్ రేవూరి రాజేశ్వరి అధ్యక్షతన ఏర్పాటైన ఈ శిబిరంలో రోగులకు వైద్య సిబ్బంది అందజేస్తున్న సేవలను ఆమె పరిశీలించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, వైఎస్ ఎంపీపీ రుద్రరాజు చినరాజా, నెడ్‌క్యాప్ డైరెక్టర్ పాటి శివకుమార్, పార్టీ వైస్ ప్రెసిడెంట్ పెదపాటి నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంతో ఉండాలన్న లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. మండలంలోని కె.ఏనుగుపల్లి సర్పంచ్ తోలేటి బంగారునాయుడు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష క్యాంపులు నిర్వహించారు. 413 మందికి వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. ఎంపీడీఓ ఎం.భారతి, డాక్టర్ కె.సుబ్బరాజు, ఎంపీటీసీ కొల్లే సూర్యనారాయణ, నాయకులు యల్లమెల్లి సత్తిపండు తదితరులు పాల్గొన్నారు.

కాలనీకి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం

మామిడికుదురు: పాశర్లపూడిబాడవ రైల్వే నిర్వాసితుల కాలనీకి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు చెప్పారు. రైల్వే నిర్వాసితుల కాలనీలో రూ.55 లక్షలతో నిర్మించనున్న తాగునీటి ట్యాంకు, పైప్‌లైన్ నిర్మాణం పనులకు శనివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ నిధులతో నియోజకవర్గ పరిధిలోని ప్రతి ఒక్కరికీ ఇంటింటికి కుళాయిల ద్వారా తాగునీరు అందిస్తామన్నారు. దీంతో పాటు పాశర్లపూడిబాడవలో రైల్వే నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, కుసుమ శ్రీధర్, సర్పంచ్ కొనుకు ప్రేమజ్యోతి, ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ అంకాడి ఏడుకొండలు, పీఏసీఎస్ చైర్మన్లు యూవీవీ సత్యనారాయణ, కటకంశెట్టి ఆదిత్యకుమార్, గ్రామశాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు, పాశర్లపూడి సత్రం చైర్మన్ వాసంశెట్టి రామకృష్ణ, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు పాల్గొన్నారు.

పాస్టర్ ఫెలోషిప్ సభ్యులంతా ఐకమత్యంతో ఉండాలి

ఆత్రేయపురం: పాస్టర్ ఫెలోషిప్ సభ్యులంతా ఐకమత్యంగా ఉండాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆత్రేయపురంలో శనివారం మండల పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశంలో ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ కార్పొరేషన్ చైర్మన్ మేడిద జాన్సన్, జిల్లా వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్ ముఖ్యఅతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌కు ఎవరితోనూ పొత్తులేదని ప్రజలతో, దేవుడితో ఉందన్నారు. కుల, మత, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించారన్నారు. అనంతరం పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్‌ను సన్మానించి సత్కరించారు. అనంతరం గ్రామంలో పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు కొల్లి శ్యామసన్, సీనియర్ పార్టీ నాయకులు చిలువూరి బాబిరాజు, ఎం.కృష్ణంరాజు, వి.రామకృష్ణంరాజు పాల్గొన్నారు.

వేంకటేశ్వర ఆలయాల్లో పూజలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయాలు శనివారం భక్తులతో కిక్కిరిశాయి. పలు గ్రామాల్లోని ఆలయాల ఆవరణలో భక్తులు గోవింద నామస్మరణతో ప్రదక్షిణలు చేస్తూ భక్తపారవశ్యం చెందారు. ఆయా ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాలను పూల, తులసి మాలలతో అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. చింతలూరులోని గోశాలను దర్శించుకున్న భక్తులు గోమాతలకు పూజలు నిర్వహించారు.

నల్లచెరువులో..

అయినవిల్లి: నల్లచెరువులో కొలువైన వేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం భక్తులతో కిక్కిరిసింది. స్వామికి ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామికి కానుకలు, మొక్కులు చెల్లించారు. చిన్నారులకు తులాభారం నిర్వహించారు. అలాగే అయినవిల్లి విఘ్నేశ్వరుని ఆలయానికి కూడా భక్తులు పోటెత్తారు.

ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు మహిళలకు వరం

ఆలమూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఉచితంగా పంపిణీ చేస్తున్న ఉజ్వల గ్యాస్ కనెక్షన్లు పేదింటి మహిళలకు వరం లాంటిదని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆలమూరు ఎంపీపీ కార్యాలయంలో శనివారం ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన ఉజ్వల గ్యాస్ కనెక్షన్ల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మండలలోని వివిధ గ్రామాలకు చెందిన 136 మంది లబ్ధిదారులకు సుమారు రూ.ఏడు లక్షల విలువైన ఉజ్వల గ్యాస్ కనెక్షన్లను పంపిణీ చేశారు. పార్టీ రాష్ట్ర సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, సర్పంచ్ నేలపూడి లావణ్య, వనుం చిన్నావతి, యేడిద సత్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.



రావులపాలెంలో గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి

రావులపాలెంలో 390 గ్యాస్ కనెక్షన్ల పంపిణీ

రావులపాలెం: స్థానిక ఎంపీపీ కార్యాలయంలో శనివారం ఉచిత గ్యాస్ కనెక్షన్లు పంపిణీ నిర్వహించారు. సభలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ ఉజ్వల పథకంలో భాగంగా జిల్లాలోనే అత్యధికంగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో లబ్ధిదారులకు 1,250 గ్యాస్ కనెక్షన్లు అందజేశామన్నారు. ఆంధ్ర, తెలంగాణలో మొట్ట మొదటిసారిగా రావులపాలెం మండలం కేతరాజుపల్లి గ్రామాన్ని పొగ రహిత గ్రామంగా నిలిపేందుకు రాహుల్ ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ విశేష కృషి చేశారన్నారు. ఇందుకు జిల్లా కలెక్టర్ ఉత్తమ గ్యాస్ ఏజెన్సీ అవార్డును అందజేసిందన్నారు. అనంతరం 390 మందికి గ్యాస్ కనెక్షన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కర్రి వీర్రెడ్డి, రాహుల్ ఇండేన్ గ్యాస్ చైర్మన్ కొవ్వూరి వెంకటేశ్వరరెడ్డి, జిల్లా పార్టీ ఎస్సీ విభాగం అధ్యక్షుడు కప్పల శ్రీధర్, ఎంపీడీఓ జి.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

అమరవీరుల సేవలు మరువలేం

అయినవిల్లి/రాజోలు/అంబాజీపేట/ఆలమూరు/పి.గన్నవరం: పోలీసు అమరవీరుల సేవలు ఎన్నటికీ గుర్తుండిపోతాయని రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. శనివారం ముక్తేశ్వరం సెంటర్‌లో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం అయినవిల్లి ఎస్సై ఎస్.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. పోలీసు అమరవీరుల ఫ్లెక్సీకి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. విధి నిర్వహణలో వారు అందించిన సేవలను కీర్తించారు. కార్యక్రమంలో సీఐ ప్రశాంత్‌కుమార్, పోలీసు సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే రాజోలులో సర్కిల్ కార్యాలయం నుంచి సీఐ గోవిందరాజు ఆధ్వర్యంలో స్మారకస్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆలమూరులో స్థానిక ఎస్సై ఎల్.శ్రీను నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అమరవీరుల త్యాగాలను గుర్తుచేస్తూ పురవీధుల్లో భారీ ర్యాలీ నిర్వహించారు. అమరవీరుల త్యాగాలను ఈ జాతి ఎన్నటికి మరువలేదని అంబాజీపేట ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్ అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉందుర్తి నాగబాబు అధ్యక్షతన అంబాజీపేట సెంటర్‌లో మండల ఆర్‌టీఐ యాక్టివిస్టులు, ది అంబాజీపేట జర్నలిస్ట్ అసోసియేషన్‌ల ఆధ్వర్యంలో శనివారం రాత్రి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పోలీసు అమరవీరుల త్యాగాలను సమాజం ఎన్నటికీ మరువదని పి.గన్నవరం ఎస్సై హరికోటి శాస్త్రి అన్నారు. స్థానిక స్టేషన్ నుంచి సెంటర్ వరకూ ఎస్సై ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. మూడు రోడ్ల సెంటర్‌లో మానవహారం నిర్వహించారు.



ముక్తేశ్వరంలో అమరవీరుల ఫ్లెక్సీకి నివాళులర్పిస్తున్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్యే చిట్టిబాబు

ప్రజలంతా సీఎం జగన్‌కు అండగా నిలవాలి

మలికిపురం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి కట్టుబడి నిరంతరం శ్రమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న కాలంలో ప్రజలంతా అండగా నిలవాలని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శనివారం గూడపల్లిలో రెండో రోజు ఎమ్మెల్యే రాపాక అధికారులు, వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో కలసి గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సీఎం జగన్ పాలనలో ఆయా కుటుంబాలకు అందించిన సంక్షేమ ఫలాలు వివరించే బ్రోచర్లను ఎమ్మెల్యే అందజేశారు. చిన్న, చిన్న కారణాల రీత్యా అర్హులకు పథకాలు అందకపోతే వాటి పరిష్కారానికి అక్కడికక్కడే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం జగన్ సారథ్యంలో వైద్య రంగంలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు చరిత్ర సృష్టిస్తున్నాయన్నారు. సర్పంచ్ సుందర తాతాజీ, నాయకులు సింహాద్రి, సుంకర బాబ్జీ, గుండుమేను నారాయణమూర్తి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



గూడపల్లిలో మహిళకు పథకాల బ్రోచర్ ఇస్తున్న ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు

తాటమ్మకు బంగారు, వెండి ఆభరణాల సమర్పణ

పి.గన్నవరం: గ్రామదేవత తాటమ్మ వారికి పి.గన్నవరం కాపు సంక్షేమ సంఘం, వారి ఆడపడుచుల విరాళం రూ.7 లక్షలతో కొనుగోలు చేసిన వెండి గరగ, ఆభరణాలను శనివారం సమర్పించారు. అమ్మవారికి రుద్రాభిషేకం, సహస్ర కుంకుమార్చనలు, చండీ హోమం, రుద్ర హోమం తదితర పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వెండి గరగ, గరగకు వడ్డాణం, మూల విరాట్‌కు కవచం, త్రిశూల బహూకరణ కార్యక్రమాలు కనులపండువగా జరిగాయి. తొలుత గరుడేశ్వర స్వామి ఆలయం నుంచి ఊరేగింపు జరిగింది. ఈసందర్భంగా కాపు సంక్షేమ సంఘం, వారి ఆడపడుచుల ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్న సమారాధన చేశారు. పరిసర గ్రామాలకు చెందిన వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. పూజల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమాలకు కాపు సంక్షేమ సంఘ నాయకులు, పెద్దలు ఆధ్వర్యం వహించారు.



పి.గన్నవరంలో తాటమ్మకు సమర్పిస్తున్న బంగారు, వెండి ఆభరణాలు

బాలబాలాజీ స్వామికి రూ.3.31 లక్షల ఆదాయం

మామిడికుదురు: దసరా సెలవులు కావడంతో అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయానికి శనివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలైంది. వేకువ జామున వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, సుప్రభాత సేవతో స్వామి వారిని మేల్కొలిపారు. హోమం వైభవంగా జరిపించారు. పవిత్ర వైనతేయ నదిలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు.. స్వామికి ముడుపులు, మొక్కులు చెల్లించారు. ఆలయం చుట్టూ ఏడు ప్రదక్షిణలు చేశారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.3.21 లక్షల ఆదాయం సమకూరింది. లడ్డూ ప్రసాదం, దర్శనం టిక్కెట్ల విక్రయం ద్వారా రూ.2,61,695, నిత్యాన్నదానానికి విరాళాలుగా రూ.99,195 చొప్పున వచ్చాయి. స్వామిని 4,375 మంది భక్తులు దర్శించుకున్నారు. 3,592 మంది అన్నప్రసాదం స్వీకరించారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈఓ జి.శ్రీదేవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, బోర్డు సభ్యులు పర్యవేక్షించారు.



కాళరాత్రి అలంకరణలో పెదపట్నంలంక కనకదుర్గమ్మ



అంబాజీపేటలో మహాలక్ష్మీదేవిగా దర్శనమిస్తున్న వాసవీ మాత



నర్సిపూడిలో లలితాత్రిపురసుందరిగా దర్శనమిచ్చిన అమ్మవారు

లలితాత్రిపుర సుందరిగా జగన్మాత..

ఆలమూరు/అంబాజీపేట/మామిడికుదురు/కొత్తపేట/ఆత్రేయపురం: దసరా మహోత్సవాలు పురస్కరించుకుని సంధిపూడి దుర్గమ్మవారు లలితా త్రిపుర సుందరి రూపంలో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. అంబాజీపేట వాసవీ కన్యకాపరమేశ్వరి శనివారం మహాలక్ష్మి దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మామిడికుదురు మండలం పెదపట్నంలంక కనకదుర్గమ్మ కాళరాత్రి అలంకారంలో, అప్పనపల్లి బాలబాలాజీ స్వామి సన్నిధిలోని ఆండాళ్ తాయార్‌కు సహస్ర నామార్చన ఘనంగా నిర్వహించారు. కొత్తపేట మండలంలోని ఏనుగులమహల్ రాజరాజేశ్వరీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక బొరుసువారిపావరం విజయకనకదుర్గాదేవిని లలితాత్రిపురసుందరీదేవిగా అలంకరించారు. ఆత్రేయపురం మండలం ఉచ్చిలిలో విజయదుర్గాదేవి లలితాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు.